క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కల్వకుర్తిరూరల్: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని సీఐ జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి శివ మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఆనంద్‌గౌడ్, జంగయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, రాఘవేందర్‌గౌడ్, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా ఆంజనేయస్వామి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధుల గుండా స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. జై హనుమాన్ నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. గ్రామస్తులు కోలాటాలు ఆడారు. భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహారావు, విజయభాస్కర్, ప్రశాంత్, సత్యనారాయణ, వెంకటయ్య, మాజీ సర్పంచ్ పర్వత్‌రెడ్డి, క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



చారకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్దామని అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం మాజీ ఎంపీటీసీ ఈదమయ్య, నాయకులు, కార్యకర్తలు అచ్చంపేట్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో ఆయనను కలిశారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో నాయకులు తనేష్, శివ, యాదయ్య, రవి, నరేష్, నాగరాజు, శంకర్, సురేష్ ఉన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపును పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీకి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, శ్రీనివాస్ గౌడ్, రాఘవేందర్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి నీటి సరఫరా పునరుద్ధరణ



తాడూరు: మండల కేంద్రంలో పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా మూడు రోజుల పాటు నీటి సరఫరాలను నిలిపివేశారు. దీంతో రెండు రోజులుగా మరమ్మతు చేపట్టారు. బుధవారం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ వినోద్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు గగ్గలపల్లి, తాడూరు మధ్యన పైపులు పగలడంతో సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. పగిలిపోయిన పైపుల స్థానంలో కొత్త పైపులను అమర్చామని తెలిపారు.

రైతన్న ఆందోళన



నేలకొరిగిన మిర్చి మొక్కలు



ఒంగురోనిపల్లిలో నేలకొరిగిన వరిపైరును చూపిస్తున్న రైతు

అమ్రాబాద్: ఇటీవల అల్పపీడనం కారణంగా మిచాంగ్ తుఫాన్‌తో మండలంలో ముసురు వర్షం కురిసింది. దీంతో వరి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల ముసురుతో రైతన్న దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన వరి పంట కళ్లెదుటే నేలకొరిగింది.

మండలంలో వరిసాగు..

మండలంలో బోరుబావుల వద్ద 430 ఎకరాలలో వానాకాలం వరిపంట సాగు చేశారు. మండల కేంద్రమైన అమ్రాబాద్‌తో పాటు మండలంలోని లక్ష్మాపూర్(బీకే), ఒంగురోనిపల్లి, జంగంరెడ్డిపల్లి, తెలుగుపల్లి, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి తదితర గ్రామాల్లో ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఇటీవల కురిసిన ముసురువర్షం, ఈదురుగాలులకు పంట మొత్తం నేలవేలింది. దుక్కిదున్నడం, విత్తనాలు, మందులు మొత్తం పెట్టుబడి ఖర్చు ఎకరానికి రూ. 30వేల వరకు అయ్యింది. వర్షం కారణంగా వడ్లు రాలడంతో పాటు రంగు మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్చి రైతు కుదేలు

గతేడాది ఎర్రబంగారం(మిర్చి)లాభాలు రావడం వల్ల ఈ సారి రైతులు మండల వ్యాప్తంగా మిర్చిపంటను అధికంగా సాగు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం 3008 ఎకరాలల్లో మిర్చి సాగు చేశారు. ప్రస్తుతం పంట మొదటి దశలో వచ్చిన కాయ పండు దశలో ఉండగా ఇంకా పూత పిందె ఉంది. ఈ క్రమంలో ముసురు వర్షానికి కాయ బరువుతో ఉన్న మిర్చి అడ్డం పడింది. అంతేగాకుండా తెగుళ్లకూడా అధికంగా వచ్చాయి. ఇప్పటికే తెగుళ్ల నివారణ, పంట ఎదుగుదల కోసం అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంటల నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తగు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పంట పూర్తిగా దెబ్బతింది



రెండు ఎకరాలలో వరి, మరో రెండు ఎకరాలలో మిర్చి సాగు చేశాను. ముసురు వర్షం కారణంగా వరిపైరు నేలకొరిగింది. మిరపకాయలు బరువుతో కిందపడ్డాయి. నేలకు ఒరిగినా మిర్చిమొక్కలను నిలిపేందుకు యత్నించగా అవికూడా మధ్యలోనే కట్ అయ్యాయి. ఉన్న మొక్కలకు తెగుళ్లు సోకాయి. అధికారులు పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– జక్క వెంకటేశ్వర్లు, ఒంగురోనిపల్లి

పంటలను పరిశీలించాం

ముసురు వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించాం. ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– వ్యవసాయాధికారి సందీప్, అమ్రాబాద్

పట్టణ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

కందనూలు: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ముచ్చటించారు. అనంతరం ప్రధాన రోడ్డులో ఉన్న దుకాణదారులను పలకరిస్తూ స్థానికులతో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేరుస్తామన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలోని ఆయన నివాసంలో కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో కలిసి దామోదర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 178 మంది రక్తదానం చేశారని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ లాల్ తెలిపారు.

తెలకపల్లి: ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బస్టాండ్‌లో నాయకులు కేక్‌కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్‌కు వెళ్లి దామోదర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, రాముడు, కుర్మయ్య, శ్రీనివాసులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలోని వసతులు, వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాగే విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితోనూ పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌చంద్ర, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అచ్చంపేట సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు



పెద్దకొత్తపల్లిలో..

అచ్చంపేట రూరల్: సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీసు ఆవరణలో తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎనిమిది గంటల పని, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తెలకపల్లి: గ్రామీణ ప్రాంతాలలో తపాలా శాఖలో పనిచేస్తున్న జీడీఎస్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐజీడీఎస్‌యూ తెలంగాణ సర్కిల్ ఉపాధ్యక్షుడు శంకరయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జీడీఎస్ జేసీఏ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె మొదటి రోజు మంగళవారం ప్రారంభమైంది. స్థానిక తపాలా కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శంకరయ్య మాట్లాడుతూ తపాలా సేవలతోపాటు ఆసరా పింఛన్లు, ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు డబ్బులు ఏఈపీఎస్ ద్వారా మినీ ఏటీఎంల ద్వారా సేవలందిస్తున్నారన్నారు. గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు, గ్యాట్యువిటీ రూ.5లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీపీఎంలు రాములు, రమాదేవి, శివకుమార్, వెంకటమ్మ, మౌనిక, శ్రీలత, శివ, ఏబీపీఎం రాములు, మనోహర్, బాల్‌చెన్నయ్య, కృష్ణయ్య, శ్రీదర్, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: గ్రామీణ తపాలా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తపాలా కార్యాలయం ఎదుట సిబ్బంది సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా తపాలా ఉద్యోగుల అధ్యక్షురాలు వనజ మాట్లాడుతూ కమలేష్ చంద్రకమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్మయ్య, శేఖర్, సల్మా, గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట



పెంట్లవెల్లి: కార్తీకమాసం అమావాస్య పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు, జటప్రోల్, గోపులాపురం, మంచాలకట్ట గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి, శివాలయ ఆలయాలు భక్తులతో కిటకిటలాడారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించి అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులకు అవగాహన



లింగాల: తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌పై ఉపాధ్యాయులకు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తాహెర్ పాషా అధ్యక్షతన జీవ, భౌతిక రసాయన శాస్త్రం పాఠ్యాంశాల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యాప్ ద్వారా సెల్ఫ్ అసెస్మెంట్, విద్యార్థుల మార్కుల నమోదు, ఉన్నతి ప్రకారం బోధించాల్సిన పాఠ్యాంశాలు, ప్రశ్నాపత్రాల తయారీ అంశాలపై అవగాహన కల్పించారు. అవగాహన పొందిన అంశాలను బోధనలో అమలు చేయాలని సూచించారు. జిల్లా స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ మురళీధర్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకుడు ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మంగళవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన ఆశాదీప్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని కల్వకుర్తి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు అనిల్‌గౌడ్ పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పద్మశాలీ యువజన సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లింగాల: అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను మంగళవారం మండలానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఐదేళ్లుగా అద్దె భవనంలోనే..



అద్దె భవనంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అద్దె భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. దీంతో మండల ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చి నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సరైన గదులు, నీడ లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. కాని తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించలేదు. ఐదేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. అధికారులకు, ప్రజలకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ భవన నిర్మాణం కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ హక్కులకు భంగం కలిగించొద్దు



కొల్లాపూర్: మానవ హక్కులకు భంగం కలిగించొద్దని మెజిస్ట్రేట్లు ఆర్‌వీఎస్‌ఎస్ మిధున్‌తేజ, జ్యోత్స్న గుంటిలు అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మంగళవారం మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. కేసుల పరిష్కారంలో రాజీ మార్గం ఉత్తమం అని పేర్కొన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించడం చట్టరిత్యానేరం అన్నారు. ఈనెల 30 వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని, కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వసంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావ్, నాగరాజు, నిరంజన్, ఉపేందర్, మధుసూధన్‌రావు తదితరులున్నారు.

గుండాలలో ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక అమావాస్య సందర్భంగా స్వామివారికి తైలాభిషేకం, విశేషాలంకరణ తదితర పూజలు చేశారు.

పునాదులకే పరిమితం



తాడూరు: మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఆరేళ్ల కిందట డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు హడావిడిగా చేపట్టారు. పిల్లర్ల నిర్మాణం చేపట్టి వదిలేశారు. ప్రస్తుతం పిల్లర్ల ఇనుపచువ్వలు తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లాన్ని సరఫరా చేసే వ్యక్తులపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చౌటపల్లితండాలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. తండాకు చెందిన హన్మంత్ ఇంటిలో 20 సంచుల్లో ఉన్న ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటాల్ పటిక ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి వ్యక్తిని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జెడ్పీటీసీని సన్మానిస్తున్న మహిళలు

మన్ననూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. మంగళవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం, లింగమయ్య స్వామి ఆలయంతో పాటూ అమ్రాబాద్‌లోని అమరేశ్వర ఆలయాల్లో వైస్‌ఎంపీపీ ప్రణీత, మాజీ వైస్ ఎంపీపీ సంబుశోభ, హైమావతి, సుజాతలతో కలిసి ఆమె పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరికి మేలు కలిగే విధంగా చూడాలని మొక్కుకున్నారు. అనంతరం మహిళలు జెడ్పీటీసీ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



తీగలపల్లిలో మురుగునీటిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కోడేరు: మండలంలోని తీగలపల్లిలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు చేరింది. దీంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈగలు, దోమల వ్యాప్తి చెంది విషజ్వరాలబారిన పడుతున్నామని ఆరోపించారు. గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తితే మురుగులోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. విద్యుత్ సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఉన్న శిలాఫలకాన్ని ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆర్ అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి మంగళవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శివయ్య తెలిపారు.

యువతి అదృశ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన యువతి(22) అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల, పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 9న యువతి ఇంటి నుంచి బయటకు వెళ్తునట్లు కు టుంబసభ్యులకు చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచుకీ తెలవలేదు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివయ్య తెలిపారు.